# సాక్షి నిర్మల్

శనివారం । 2 । మార్చి । 2024






## ఉద్యోగాలు సాధించారు
ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే ఎంతో పట్టుదల, కృషి అవసరం. ఇలా కష్టపడ్డ పలువురు యువతీయువకులు ఒకటి కంటే ఎక్కువ కొలువులు కొట్టి ఔరా.. అనిపించారు. 8లో ▶

## జర్నలిస్టుల సమస్యలపై పోరు
నిర్మల్‌చైన్‌గేట్: జర్నలిస్టుల సమస్యలపై పార్టీ తరఫున పోరాటం చేస్తామని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం టీయూడబ్ల్యూజే, ఐజేయూ ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టులు మహేశ్వర్‌రెడ్డిని జిల్లా కేంద్రంలో కలిసి సత్కరించారు. అనంతరం సమస్యలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో జర్నలిస్టుల సమస్యలు ప్రస్తావిస్తానని చెప్పారు.

## వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
36.0 /24.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలోని కొన్ని చోట్ల ఉదయం, మరికొన్ని చోట్ల సాయంత్రం జల్లులు కురిసే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### 'బాబ్లీ' నీటి విడుదల



ప్రాజెక్ట్ నుంచి దిగువకు వెళ్తున్న నీరు

భైంసా: శుక్రవారం బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఏటా మార్చి 1వ తేదీన బాబ్లీ ప్రాజెక్ట్ నీటిని దిగువకు వదలాలి. వేసవిలో గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలోని పశువులు, వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి, భూగర్భ జలాలు పడిపోకుండా ఉండేందుకు కోర్టు ఈ తీర్పు ఇచ్చింది. మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్ట్ వద్దకు శుక్రవారం త్రిసభ్య కమిటీ సభ్యులు చేరుకుని గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు.

### 16న లోక్ అదాలత్
నిర్మల్‌టౌన్: ఈ నెల 9న నిర్వహించాల్సిన నేషనల్ లోక్ అదాలత్‌ను 16వ తేదీకి వాయిదా వేసినట్లు జిల్లా లీగల్ అథారిటీ కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. న్యాయవాదులు గమనించాలని సూచించింది.

### ఇంటర్ పరీక్షకు 458 మంది గైర్హాజరు
నిర్మల్ రూరల్: జిల్లాలో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు 458 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 6,413 మంది విద్యార్థులకు 5,955 మంది మాత్రమే హాజరయ్యారు. జనరల్ కేటగిరిలో 5,192 మందికి 4,918 మంది హాజరు కాగా, 274 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరిలో 1,221 మందికి 1,037 మంది హాజరు కాగా, 184 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో పరశురామ్ తెలిపారు.

### ఇంటిపన్ను వసూలు
నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ పంచాయతీ కార్యదర్శి నరేశ్‌కుమార్ ఆన్‌లైన్‌లో ఇంటిపన్ను వసూలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామంలో 1,345 గృహాల ఇంటి పన్నులు, 52 రకాల ఇతర వసూళ్లు ఉండగా ఇప్పటికే 96 శాతం వసూలు చేశారు. మిగతా 4 శాతం పూర్తి చేసి వందశాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ఇంటి నంబర్ ఎంటర్ చేయగానే చెల్లించే పన్ను కంప్యూటర్‌పై క్యూఆర్ కోడ్ రూపంలో చూపిస్తుంది. ఇంటి యజమాని ఫోన్ ద్వారా కోడ్ స్కాన్ చేయగానే డబ్బులు డిజిటల్ లావాదేవీల రూపంలో చెల్లింపు పూర్తవుతుంది.

### సంకల్ప సభలు సక్సెస్



మాట్లాడుతున్న రాంనాథ్

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ రాష్ట్రంలో నిర్వహించిన విజయ సంకల్ప సభలు విజయవంతమయ్యాయని పార్టీ రాష్ట్ర నాయకుడు, కుమురంభీమ్ ఆసిఫాబాద్ విజయసంకల్ప యాత్ర ఇన్‌చార్జి రావుల రాంనాథ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కుమురంభీమ్ ఆసిఫాబాద్ క్లస్టర్‌లో ఈనెల 20వ తేదీన బాసరలో ప్రారంభమైన యాత్ర 10 రోజులపాటు ఆదిలాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని 21 శాసనసభ స్థానాల్లో కొనసాగిందని పేర్కొన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. భారత్ ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా ఉండాలంటే నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 17 సీట్లు కైవసం చేసుకుని ప్రధాని మోదీకి బహుమతిగా ఇవ్వాలని కోరారు. 67 రోడ్‌షోలు, 20 బహిరంగ సభలు నిర్వహించి యాత్ర విజయవంతం చేసినట్లు చెప్పారు. కుమురంభీమ్ ఆసిఫాబాద్ క్లస్టర్ యాత్ర పలు విభాగాల ఇన్‌చార్జిలు సామ రాజేశ్వర్‌రెడ్డి, రాచకొండ సాగర్, కుమ్మరి వెంకటేశ్, నాయకుడు తోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం
నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో వివిధ ప్రోగ్రాంలలో నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేసేందుకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ధనరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్-1, సైకాలజిస్ట్-1, స్టాఫ్‌నర్స్-9, ఏఎన్‌ఎం-6, డాటా ఎంట్రీ ఆపరేటర్ కం అకౌంటెంట్-1, రిఫ్రిజిరేటర్ మెకానిక్-1 పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం, పూర్తి వివరాలకు nirmal. telangana.gov.in లో సంప్రదించాలని సూచించారు. దరఖాస్తుకు అర్హత పత్రాలు జతచేసి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఈ నెల 7వ తేదీ లోపు అందజేయాలని తెలిపారు.

# ఆర్జీయూకేటీ.. పట్టింపేది?

- ఇంకెన్నాళ్లీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్
- ఉన్న డైరెక్టరూ.. వెళ్లిపోయారు
- డీన్‌లకే బాధ్యతలు అప్పగింత
- అధ్యాపకులకు ఉద్యోగ భద్రతేది?
- విద్యార్థులకు ఎస్‌జీసీ ఏర్పాటేది?
- సమస్యలు చెప్పకొనే పరిస్థితేది?
- ఇంకా కొనసాగుతున్న కేసులు



రెండేళ్ల క్రితం క్యాంపస్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

నిర్మల్: ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్‌ఐటీ పాలన మళ్లీ గాడితప్పుతోందా? అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి. పేదింటి పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దే విద్యాక్షేత్రంపై చిన్నచూపు కొనసాగుతోంది. దాదాపు తొమ్మిదివేల మంది విద్యార్థులు ఉండే వర్సిటీకి రెగ్యులర్ వీసీ లేకపోవడం, ఇన్‌చార్జి వీసీ ఉన్నా.. ఆయన వర్సిటీలో ఉండకపోవడం దారుణం. ఏదైనా ఘటన జరిగినప్పుడు.. క్యాంపస్‌లో కార్యక్రమం ఉన్నప్పుడే వచ్చివెళ్తున్నారు. స్థానికంగా ఉండే డైరెక్టర్ కూడా తాజాగా మాతృసంస్థకు వెళ్లిపోవడంతో ట్రిపుల్‌ఐటీ పరిస్థితి అందరూ ఉన్న అనాథలా మారింది. వర్సిటీలో బాధ్యతలను డీన్‌లకే అప్పగించి చేతులు దులుపుకొనే పరిస్థితి కనిపిస్తోంది. పాత ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఆర్జీయూకేటీని పట్టించుకోవడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు.

**ఉద్యోగ భద్రత లేకపోవడంతో..**

ఐఐటీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చదివిన వాళ్లు, మంచి మెరిట్ ఉన్న విషయ నిపుణులతో బాసర ట్రిపుల్‌ఐటీ కళకళలాడేది. అలాంటి విద్యావంతుల బోధనతో వేలమంది విద్యార్థులు ఉన్నతస్థానాలకు ఎదిగారు. క్రమంగా తమ ఉద్యోగ భద్రత అగమ్యగోచరంగా మారడంతో సదరు అధ్యాపకులు ఇతర ఉద్యోగాల వైపు వెళ్లిపోతున్నారు. దాదాపు తొమ్మిదివేల మంది విద్యార్థులు ఉండే వర్సిటీలో కనీసం 350మంది వరకు అధ్యాపకులు ఉండాలి. కానీ.. 125మంది మాత్రమే ఉన్నారు. ఇందులో రెగ్యులర్ వాళ్లు 20మంది వరకే ఉండటం గమనార్హం. ముందునుంచీ బాసర ట్రిపుల్‌ఐటీ ఫ్యాకల్టీ కారణంగానే ఉన్నతస్థానంలో నిలిచింది. కాంట్రాక్ట్ జేఎల్, డీఎల్‌లను పట్టించుకున్న గత ప్రభుత్వం ఆర్జీయూకేటీ ఫ్యాకల్టీని మాత్రం కన్నెత్తి చూడలేదు. ఇలాంటి పరిస్థితుల్లో చాలామంది అధ్యాపకులు ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేట్‌లో మంచి ఉపాధి ఉన్నవైపు వెళ్తున్నారు. చివరకు వర్సిటీకి గెస్ట్ ఫ్యాకల్టీనే పెద్దదిక్కవుతోంది.

**ఎస్‌జీసీ ఎక్కడ?**

ఎస్‌జీసీ (స్టూడెంట్స్ గవర్నింగ్ కౌన్సిల్) రెండేళ్ల క్రితం వర్సిటీలో సమస్యలపై రాజీలేని పోరాటం చేసింది. వర్సిటీలోని ప్రతీ బ్రాంచ్ నుంచి ఒక్కో విద్యార్థి, విద్యార్థిని చొప్పున ఎన్నికైన కౌన్సిల్ ఏళ్లుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చేదాకా వెనక్కు వెళ్లేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. జిల్లా నుంచి ఢిల్లీదాకా అందరి దృష్టిని ఆకర్షించారు. చివరకు తమ డిమాండ్లలో కొన్నింటినైనా సాధించారు. అలాంటి ఎస్‌జీసీ ఆతర్వాత నుంచి జాడ లేకుండా పోయింది. కనీసం విద్యార్థులు తమ సమస్యలను విన్నవించుకునే వీలు కూడా లేకుండా పోయింది.

**ఇప్పటికీ వాళ్లపై కేసులు**

తమ సమస్యలు పరిష్కరించాలంటూ 2022జూన్‌లో నిరసనలు చేపట్టిన ఎస్‌జీసీ బాధ్యులపై పోలీసు కేసులు పెట్టించారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ అందరి తరఫున చేసిన పోరాటానికి తమకు ఇదా ప్రతిఫలం? అని వారు వాపోతున్నారు. ఇప్పటికీ తమ భవిష్యత్ ఇబ్బందికరంగానే ఉందంటున్నారు. ఇకపై ఎవరూ గొంతెత్తవద్దు.. అన్న రీతిలో వర్సిటీ వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

### ఎన్నాళ్లీ ఇన్‌చార్జి వీసీ?
మిగతా యూనివర్సిటీలకు ఆర్జీయూకేటీకి చాలా తేడా ఉంది. చుట్టూ ప్రహరీతో పూర్తిగా రెసిడెన్షియల్ క్యాంపస్‌గా ఉండే ఈ సువిశాల ప్రాంగణంలో దాదాపు తొమ్మిదివేల మంది విద్యార్థులుంటారు. ఇంతపెద్ద విద్యాసంస్థలో అప్పుడప్పుడు ఏదో ఒక ఘటన జరగడం సహజమే. కానీ.. తరచూ విద్యార్థుల ఆత్మహత్యలు, పెట్టే భోజనంతో సహ యూనిఫాం, ల్యాప్‌టాప్స్, షూస్.. ఇలా ఎన్నో సమస్యలు వస్తూనే ఉన్నాయి. స్థానికంగా సరిగా పర్యవేక్షిస్తూ.. ప్రభుత్వంతో అనుసంధానిస్తూ.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించగలిగే వాళ్లు అవసరం. గతంలోనూ ఇన్‌చార్జి వీసీల పాలన కారణంగానే విద్యార్థులు తీవ్ర ఉద్యమం చేపట్టేదాకా వెళ్లింది. అప్పుడు ఎన్నో హామీలిచ్చిన గత ప్రభుత్వం మళ్లీ పాత తప్పే చేసింది. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా ఉన్న వెంకటరమణకు ఇన్‌చార్జి వీసీ బాధ్యతలిచ్చింది. ఇప్పుడు ఆయన కూడా స్థానికంగా ఉండటం లేదు. తనకు ఇదొక అదనపు బాధ్యత మాత్రమే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అరకొర పట్టింపుతోనే ఆర్జీయూకేటీ జాతీయ స్థాయి అవార్డులు సాధిస్తోంది. ఇక పూర్తిస్థాయి వీసీని, సరిపడా అధ్యాపకులు నియమించి సమస్యలు లేని వర్సిటీని చేస్తే.. అంతర్జాతీయంగా పేరు తీసుకువస్తామని ఇక్కడ విద్యార్థిలోకం అంటోంది.

### సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు



బాసర సరస్వతీమాత చెంత ఉన్న ట్రిపుల్‌ఐటీని ఎలాంటి సమస్యలు లేకుండా మంచి యూనివర్సిటీగా కొనసాగించాలన్నది మా ప్రయత్నం. అందులో భాగంగానే ఇక్కడ ఇన్‌చార్జి వీసీని తొలగించి వెంటనే రెగ్యులర్ వీసీని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డిని నేరుగా కోరాం. వర్సిటీలకు సంబంధించి కమిటీ వేశామని, త్వరలోనే ట్రిపుల్‌ఐటీపై చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు.

– పవార్ రామారావుపటేల్, ఎమ్మెల్యే, ముధోల్

## విశ్వకర్మ ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: పీఎం విశ్వకర్మ పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పథకంపై ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో మాట్లాడారు. పథకంపై గ్రామీణ స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీ గ్రామం నుంచి అధికసంఖ్యలో దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. అర్హులైన 18 రకాల చేతి వృత్తుల వారికి మొదటి విడతలో ఐదు శాతం వడ్డీకే రూ.లక్ష రుణం అందించనున్నట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని 18 నెలల్లో చెల్లించిన వారికి రెండో విడతలో రూ.2లక్షల రుణం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ రుణాన్ని 30 నెలల్లో తిరిగి చెల్లించాలని సూచించారు. మీసేవ కేంద్రాలు, గ్రామ, వార్డు పంచాయతీ కార్యాలయాల్లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైనవారికి నైపుణ్య శిక్షణ కేంద్రాల్లో వారంపాటు రోజుకు రూ.500చొప్పున చెల్లిస్తూ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామాలవారీగా ఇప్పటివరకు అందిన దరఖాస్తులపై అధికారులతో చర్చించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, ఎల్డీఎం చంద్రశేఖర్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, స్టీరింగ్ కమిటీ సభ్యులు రాజు, రాజేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

### దరఖాస్తు చేసుకోవాలి
భైంసాటౌన్: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకానికి తపాలా శాఖ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని భైంసా సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ జే దిలీప్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 40శాతం సబ్సిడీతో ఇళ్ల పైకప్పులపై సోలార్ రూఫ్‌టాప్‌లు నిర్మించి ఇస్తారని పేర్కొన్నారు. నెలకు 300 యూనిట్ల వరకు ఉచితంగా సౌర విద్యుత్ అందించడం ఈ పథకం ఉద్దేశమని తెలిపారు. పథకానికి దరఖాస్తు చేసుకునేవారు ప్రస్తుత విద్యుత్ బిల్లు, మొబైల్ నంబర్, ఇతర వివరాలతో స్థానిక తపాలాశాఖ కార్యాలయంలోని సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

# సాగు తగ్గుతోంది



- మిర్చి కొనుగోలు కేంద్రాలు లేకే..
- పంటలను పీడిస్తున్న చీడపీడలు
- నష్టాలతో సాగు తగ్గిస్తున్న రైతులు

ముధోల్: ఎండుమిర్చికి ముధోల్ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. ఇక్కడి రైతులు ప్రధానంగా మిరప సాగు చేస్తారు. మహారాష్ట్ర నుంచి కూడా ఇక్కడికి వచ్చి మిర్చి కొనుగోలు చేస్తారు. కొద్ది సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో మిర్చి సాగు తగ్గుతోంది. దీంతో వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. పక్క జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర వాసులు కూడా వచ్చి కొనుగోలు చేస్తారు. పంట నిల్వ, క్రయవిక్రయాల వసతి లేక రైతులు సాగు తగ్గిస్తూ వస్తున్నారు. కొందరు పండించిన పంటను మహారాష్ట్రకు వాహనాల్లో తరలించి అమ్ముకుంటున్నారు. క్రయవిక్రయాలకు అనువైన స్థలం లేకే రైతులు మార్కెట్ ఏర్పాటు చేస్తే లాభం ఉంటుందని చెబుతున్నారు.

**ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి**

ప్రస్తుతం ముధోల్‌లో తేజ రకం ఎండుమిర్చి కిలోకు రూ.250 పలుకుతోంది. సాధారణ రకం రూ.220 నుంచి రూ.230 వరకు ఉంది. ఇక్కడి వ్యాపారులు మహారాష్ట్రలోని సోలాపూర్, తెలంగాణలోని ఖమ్మం, వరంగల్ ప్రాంతాల నుంచి ఎండుమిర్చి కొనుగోలు చేసి ముధోల్‌లో విక్రయిస్తున్నారు. నిర్మల్‌తోపాటు నిజామాబాద్ జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా ఎండుమిర్చి కొనుగోలు చేసేందుకు వినియోగదారులు వస్తుంటారు.

### పీడిస్తున్న చీడపీడలు
మిర్చి సాగులో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగైదేళ్లుగా పంట తొలిదశలో ర సం పీల్చే పురుగు ఉధృతి తీవ్రంగా ఉంటోంది. దీంతో క్రిమిసంహారకాల వాడకం ఎక్కువైంది. మరో వైపు ముడత రోగం వ్యాప్తి చెందగా ఆశించిన స్థాయిలో దిగుబడి కూడా రావడంలేదు. ఈ నేపథ్యంలో రైతులు మిర్చి సాగుపై మక్కువ చూపడం లే దు. దీంతో మిర్చి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతోంది. చీడపీడల మూలంగా పెట్టుబడి పెట్టి మిర ప సాగు చేసిన రైతన్నలు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. దీంతో రైతులు సుమారు నాలుగైదేళ్లుగా మిరప సాగుపై మక్కువ చూపడం లేదు.

### మార్కెట్ ఏర్పాటు చేయాలి



మిర్చి దిగుబడి లేక పోవడంతోపాటు విక్రయిద్దామంటే మార్కెట్ లేక పోవడంతో మేం సాగుపై ఆసక్తి తగ్గిస్తున్నం. అధికారులు స్పందించి మార్కెట్ ఏర్పాటు చేయాలి. ఇక్కడే మద్దతు ధరతో కొనుగోలు చేసి ఆదుకోవాలి.

– మల్లేశ్, ముధోల్

### అవగాహన కల్పించాలి



మిర్చి సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి. సుదూర ప్రాంతాల నుంచి ముధోల్‌కు ఎండుమిర్చి కోసం వస్తుంటారు. సాగులో సరైన అవగాహన లేక చీడపీడలతో దిగుబడులు తగ్గిస్తున్నాం. రైతులకు అవగాహన కల్పించాలి.

– నవీన్, ముధోల్

### సాగులో సూచనలిస్తాం
రైతులకు మిర్చి సాగుకు అవసరమైన సూచనలిస్తాం. చీడపీడల కారణంగా దిగుబడి తగ్గుతుండడంతో రైతులు సాగుపై మక్కువ చూపడం లేదు. దీంతో సాగు విస్తీర్ణం తగ్గుతోంది. సాగుకు ఆసక్తి చూపే రైతులకు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి అవగాహన కల్పిస్తాం.

– భాస్కర్, ముధోల్ ఏవో

## భూదందాలో ఎంతటివారున్నా వదలం

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: డీ1 పట్టా భూముల దందాలో ఎంతటివారున్న చర్యలు తప్పవని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నిర్మల్‌లో గత పాలకుల ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు. ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ భూమిలోనే డీ మార్ట్ నిర్మిస్తున్నారని, దీని అనుమతులపై కలెక్టర్ విచారణ కొనసాగుతోందని తెలిపారు. విజిలెన్స్ ఎంక్వైరీ తర్వాత బాధ్యులు ఎవరైనా కటకటాల్లోకి వెళ్లాల్సిందేనని పేర్కొన్నారు. నియోజకవర్గంలో దాదాపు 3వేల ఎకరాల భూమి బడానేతలు కాజేశారని ఆరోపించారు. ప్రభుత్వ భూములు కాపాడి పేదలకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఆలయాల భూములను ఓవర్గం కబ్జాచేసినా గత పాలకులు మిన్నకున్నారని విమర్శించారు. ఆలయాల భూముల పరిరక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని వివరించారు. నాయకులు రావుల రాంనాథ్, సామ రాజేశ్వర్‌రెడ్డి, సరికల గంగన్న తదితరులున్నారు.

## పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి
నిర్మల్ రూరల్: పది, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి డీజీపీ రవి గుప్తా, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి శుక్రవారం ఇంటర్, 10వ తరగతి పరీక్షల నిర్వహణ, ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటుపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చూడాలని సూచించారు. అనంతరం కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులతో మాట్లాడారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోనివారు ప్రజాపాలన సేవ కేంద్రాల ద్వారా వివరాలు తెలిపి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వీసీలో ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ చౌహాన్, జెడ్పీ సీఈవో గోవింద్, డీఐఈవో పరశురాం, డీఈవో రవీందర్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డిజిటల్ అవగాహన



బాసర ప్రభుత్వ పాఠశాలలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

భైంసా: బాసరలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా డిజిటల్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ట్రిపుల్‌ఐటీలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలోని కోడ్‌క్లబ్‌కు చెందిన 16 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాసరలోని జెడ్పీఎస్‌ఎస్ బాలికల తెలుగుమీడియం, ఉర్దూమీడియం, బాలుర ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పోటీ ప్రపంచంలో ఎలా తమను తాము ప్రోత్సహించుకుని విద్య నేర్చుకోవాలో అనే అంశాలను వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతోపాటు వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు, నైతికత, విలువల ప్రాముఖ్యత గురించి తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, కంప్యూటర్ సైన్స్‌అండ్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి రెవ్యానాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ తిప్పిరెడ్డి రాకేశ్‌రెడ్డి, సీఎస్సీ ల్యాబ్ ఇన్‌చార్జి శ్రీను, వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## జీరో బిల్లు రాకుంటే ఆందోళన వద్దు
ఖానాపూర్: గృహజ్యోతి కింద జీరో బిల్ రాని వారు ఆందోళన చెందవద్దని టీఎస్‌ఎన్పీడీసీఎల్ డీఈ డీ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్‌లో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు చెందిన విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందికి పథకంపై అవగాహన కల్పించారు. పథకం అమలులో సందేహాలపై గ్రామీణ ప్రజలు మండల ప్రజాపరిషత్ కార్యాలయాలు, పట్టణ ప్రజలు మున్సిపల్ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు. ఏడీఈ కేశెట్టి శ్రీనివాస్, ఏఏవో సురేశ్, ఏఈలు తిరుపతి, సుమన్, బాలయ్య, శ్రీనివాస్ తదితరులున్నారు.

## దిలావర్‌పూర్ ఠాణా తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ జానకీ షర్మిల ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలు పరిశీలించారు. ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ అధికారులతో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి ఆవశ్యకత, ఆర్థిక, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం రిసెప్షన్, మెన్ బ్యారక్, టెక్నికల్ రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది విధులు, వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఎస్పీ వెంట ఎస్సై సుమాంజలి, సిబ్బంది ఉన్నారు.

## పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం
నిర్మల్ రూరల్: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో శుక్రవారం నిర్వహించిన విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రభుత్వ విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్, గెస్ట్ సిబ్బందికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించి పదోన్నతుల ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని సూచించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్, కోశాధికారి కుర్మే నాగయ్య, సహాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నాయకులు పరమేశ్వర్, బక్కన్న, ప్రేమ్‌కుమార్ తదితరులున్నారు.

## ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్‌నాయక్

ఖానాపూర్: పెంబి మండలంలోని దళిత, గిరిజన అంగన్‌వాడీ టీచర్లను వేధించిన ఉపాధ్యాయుడు బాపన్నను వెంటనే విధుల నుంచి తొలగించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు బుక్యా రాజేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఖానాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. సమాచార హక్కు చట్టం పేరుతో మహిళా ఉద్యోగులను పదేపదే వేధిస్తున్న ఉపాధ్యాయుడిపై కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టి విధుల నుంచి తొలగించాలని కోరారు. ఈ విషయంపై మానవహక్కుల కమిషన్‌తో పాటు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ రైట్ ప్రొటెక్షన్‌తో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ మహిళా ఉద్యోగులకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తంజేశారు. దీనిపై ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించాలని తెలిపారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు రామునాయక్, నెహ్రూ, ఎం.దాస్ తదితరులున్నారు.

## క్లుప్తంగా

### ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలి

**ఉట్నూర్‌రూరల్:** ఉట్నూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థుల జేఏసీ రాష్ట్రచైర్మన్ మేకల అక్షయ్‌కుమార్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉట్నూర్‌లో పాలిటెక్నిక్ కళాశాల ఉండడం సంతోషమన్నారు. ఆ కళాశాలను ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ కళాశాలగా అభివృద్ధి చేయాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. జేఏసీ నాయకుడు శ్యాం తదితరులు ఉన్నారు.

### ఐటీడీఏ డీడీ, ఏటీడీవోను సస్పెండ్ చేయాలి

**ఆదిలాబాద్‌రూరల్:** ఐటీడీఏ డీడీ, ఏటీడీవోను సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. విష జ్వరాల బారినపడి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మామిడిగూడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురి విద్యార్థినులను శుక్రవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో రెండు రోజుల క్రితం మహేశ్వరి విషజ్వరంతో మృతి చెందినా యాజమాన్యం, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించాలని కోరారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**ఉట్నూర్‌రూరల్:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఆదిలాబాద్ జిల్లా విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, గిరిజన సంక్షేమశాఖ డీడీ దిలీప్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతిలో ప్రవేశానికి గాను ఈ నెల 12న ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ క్రీడా పాఠశా ల మైదానంలో పలు క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ఎత్తు, బ రువు, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్‌త్రో, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, ఫ్లెక్సిబిలిటి టెస్ట్, 6 X10 మీటర్ల షటిల్ రన్, 800 మీటర్ల పరు గు పందెం అంశాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నట్లు వివరించారు. ఉట్నూర్ క్రీడా పాఠశాలలో బాలురకు 40 సీట్లు, జాతర్లలోని క్రీడా పాఠశాలలో బాలురకు 40 సీట్లు, ఆసిఫాబాద్ క్రీడా పాఠశాలలో 40 సీట్లు, బోయినపల్లి వాటర్‌స్పోర్ట్స్ అకాడమీలో 40 సీట్ల చొప్పున భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతూ 01.09.2013 నుంచి 01.09. 2015 మధ్య జన్మించిన గిరిజన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఎలిజిబిలిటి ఫారం, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బోనఫైడ్, ఆధార్ జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని కోరారు.

### రోడ్డు ప్రమాదంలో ఆవు మృతి



మృతిచెందిన ఆవు

**ఖానాపూర్:** పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆవు మృతిచెందింది. స్థానిక గంగపుత్ర గణేశ్ మండలి వద్ద మస్కాపూర్‌కు చెందిన యువకుడు మనోహర్ బైక్ ఢీకొట్టడంతో ఆవు మృతిచెందగా, వాహనదారుడికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆవుకు బజరంగ్‌దళ్ కార్యకర్తలు అంత్యక్రియలు నిర్వహించారు.

# ఉద్యోగాలు సాధించారు..

• ఒక్కొక్కరు 2.. 3.. 4 సర్కారు కొలువులు • యువతకు ఆదర్శం..

ప్రభుత్వ ఉద్యోగం సాధించడమంటే మాటలు కాదు. లక్షల మంది నిరుద్యోగుల పోటీ... వందల సంఖ్యలో పోస్టులు.. లక్ష్య సాధనకు నిరంతరం సన్నద్ధమవుతూ పట్టుదలతో ఒక్కొక్కరు ఒక ఉద్యోగం కాదు రెండు.. మూడు.. నాలుగు సర్కారు కొలువులు సాధించారు. గృహిణి కుటుంబ బాధ్యతలు మోస్తూనే ఒకరు.. ఉద్యోగం చేస్తూనే మరొకరు.. తల్లిదండ్రులకు భారం కావొద్దని వాచ్‌మన్ వంటి పని చేస్తూనే ఇంకొకరు ఇలా పోటీ పరీక్షల్లో సత్తాచాటి ముందు నిలిచారు.

## వాచ్‌మన్ టు లెక్చరర్

- తల్లిదండ్రులు ఇద్దరూ కార్మికులు
- భారం కాకుండా రాత్రి వాచ్‌మన్ ఉద్యోగం
- పది రోజుల వ్యవధిలో మూడు ఫలితాలు

**జన్నారం:** తల్లిదండ్రులు ఇద్దరూ కార్మికులు.. వారికి ఆర్థికంగా భారం కావొద్దని భావించి నైట్ వాచ్‌మన్ ఉద్యోగం చేస్తూ మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడో యువకుడు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని మంచిర్యాల జిల్లా జన్నారం పొనకల్ గ్రామం గాంధీనగర్ కాలనీకి చెందిన గొల్లె ప్రవీణ్ నిరూపించాడు. కాలనీకి చెందిన గొల్లె పెద్దులు, పోశమ్మ దంపతుల కుమారుడు ప్రవీణ్. పెద్దులు మేస్త్రీ పని చేస్తుండగా, పోశమ్మ బీడి కార్మికురాలు. ప్రవీణ్ ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు పొనకల్ ప్రాథమిక పాఠశాలలో చదివాడు. 6నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో, ఇంటర్ కరిమల జూనియర్ కళాశాలలో, డిగ్రీ వికాస్ కళాశాలలో పూర్తి చేశాడు. 2019లో హైదరాబాద్ ఓయూ క్యాంపస్‌లో చేరి ఎంకామ్ చదివాడు. అనంతరం బీఈడీ, ఎంఈడీ కూడా పూర్తి చేశాడు. ఓ వైపు చదువుకుంటూనే తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా 2019నుంచి ఉస్మానియా యూనివర్సిటీలోని ఎడ్యుకేషనల్ మల్టీ మీడియా రిసెర్చ్ సెంటర్(ఈఎంఆర్‌సీ)లో నైట్‌వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు.

**పది రోజుల వ్యవధిలో**

రాత్రిపూట వాచ్‌మన్‌గా చేస్తూనే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. పనితోపాటు రాత్రంతా చదివేవాడు. జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాల కోసం పరీక్ష రాశాడు. పది రోజుల వ్యవధిలో మూడింటి ఫలితాలు వెలువడగా మూడు ఉద్యోగాలూ సాధించాడు. ఫిబ్రవరి 11న విడుదల పీజీటీ సోషల్ స్టడీస్‌లో సెలెక్ట్ అయి, ఫిబ్రవరి 15న అపాయింట్‌మెంట్ లెటర్ తీసుకున్నాడు. గురువారం విడుదలైన జూనియర్ లెక్చరర్ ఉద్యోగాల్లో కామర్స్‌లో ఎంపికయ్యాడు. గురువారం సాయంత్రం విడుదలైన టీజీటీ ఫలితాల్లో సోషల్ స్టడీస్ విభాగంలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. వీటిలో జూనియర్ లెక్చరర్ ఉద్యోగం చేస్తానని తెలిపాడు.



అపాయింట్‌మెంట్ లెటర్‌తో ప్రవీణ్

### అమ్మానాన్నలకు కష్టం లేకుండా చూస్తా

అమ్మానాన్నలు చిన్నప్పటి నుంచి కష్టపడి నన్ను చదివించారు. వారి కష్టాన్ని చూడలేక రాత్రి పూట వాచ్‌మన్‌గా పని చేస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాను. గతంలో మూడు ఉద్యోగాలకు పరీక్షలు రాశాను విడుదలైన ఫలితాల్లో నాకు మూడు ఉద్యోగాలు రావడం ఆనందంగా ఉంది. ఇందులో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తూ మా అమ్మానాన్నలకు కష్టం లేకుండా చేస్తాను. – గొల్లె ప్రవీణ్

## కొలువుల 'జ్యోతి'

- నాలుగు ఉద్యోగాలు సాధన
- టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ పోస్టులు

**బోథ్:** మండలంలోని సొనాల గ్రామానికి చెందిన బోయినపల్లి జ్యోతి ఇటీవల విడుదలైన గురుకుల ఫలితాల్లో ఏకంగా నాలుగు ఉద్యోగాలు సాధించింది. గురుకుల విద్యాలయాల్లో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాల్లో సత్తా చాటింది. గ్రామానికి చెందిన బోయినపల్లి రాములు, లక్ష్మి దంపతుల కూతురు జ్యోతి. రాములు వృత్తిరీత్యా చిన్న పాటి పూజ సామగ్రి విక్రయ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మూడో సంతానం జ్యోతి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి వరకు చదివింది. బజార్‌హత్నూర్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. బజార్‌హత్నూర్ మండలంలోని పద్మావతి డిగ్రీ కళాశాలలో తెలుగు లిటరేచర్‌లో డిగ్రీ చదివింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు, తెలంగాణ యూనివర్సిటీలో బీఈడి పూర్తి చేసింది. సెట్‌లో ఉత్తీర్ణత పొందింది. 2023లో కస్తూర్బా విద్యాలయాల్లో సీఆర్‌టీ పోస్టు కోసం పోటీ పడి తెలుగు సబ్జెక్టులో జిల్లాలోనే మొదటి ర్యాంకు సాధించింది. ప్రస్తుతం నేరడిగొండ మండలంలోని కస్తూర్బా విద్యాలయంలో తెలుగు ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తోంది.

### పట్టుదలతో చదివాను



ఎలాగైనా ఉద్యోగం సాధించాలని లక్ష్యాన్ని ఏర్పర్చుకుని పట్టుదలతో చదివాను. ప్రతీరోజు తగిన సమయాన్ని చదువుకు కేటాయించాను. సిలబస్‌లో ఉన్న అంశాలపై అవగాహన తెచ్చుకుని చదవడం ప్రారంభించాను. తల్లిదండ్రులు ప్రోత్సాహం మరువలేను. వారి వల్లే ఉద్యోగాలు సాధించాను. డిగ్రీ అధ్యాపక వృత్తిని ఎంచుకుంటాను. – బోయినపల్లి జ్యోతి

## అప్పుడు ఆర్మీ.. ఇప్పుడు కానిస్టేబుల్



నియామక పత్రం అందుకుంటున్న తల్లెల మహేందర్

**జైనథ్:** ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే గగనమైన ఈ కాలంలో ఓ ప్రభుత్వ ఉద్యోగం సాధించి రిటైర్మెంట్ తర్వాత మరోసారి ప్రభుత్వ ఉద్యోగం సాధించడం అంటే మామూలు విషయం కాదు. ఎంతో కృషి, పట్టుదల ఉంటే తప్ప సాధ్యం కాదు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం లేఖర్‌వాడ గ్రామానికి చెందిన తల్లెల మహేందర్ 2005లో ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం సాధించాడు. 17ఏళ్ల పాటు వివిధ హోదాల్లో భారతదేశంలోనే కాకుండా, యూఎన్‌ఓ సైన్యం తరఫున లెబనాన్ దేశంలోనూ సేవలందించాడు. 2023లో రిటైర్మెంట్ తర్వాత ఇంటి వద్ద ఖాళీగా ఉండకుండా బీసీ స్టడీ సర్కిల్లో శిక్షణ తీసుకొని కానిస్టేబుల్ ఉద్యోగానికి ప్రయత్నాలు చేశాడు. ఇటీవల కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో నియామక పత్రం అందుకున్నాడు.

### సేవ చేసే అదృష్టం...



ఆర్మీ జవాన్‌గా దేశ రక్షణ కోసం బార్డర్‌లో నిరంతరం సేవలందించడం సంతోషంగా ఉంది. దేశం వెలుపల సైతం పనిచేయడం జరిగింది. ఇప్పుడు కానిస్టేబుల్‌గా ఎంపిక కావడంతో దేశ అంతర్గత వ్యవహారాల్లో లా అండ్ ఆర్డర్ పరిరక్షణ కోసం పనిచేసే అవకాశం కలుగడం అదృష్టంగా భావిస్తున్నాను. – తల్లెల మహేందర్

## పిల్లలను చదివిస్తూ..

- మూడు ఉద్యోగాలకు ఎంపికైన సిరికొండ సోన
- భర్త ప్రోత్సాహంతో డిగ్రీ, పీజీ పూర్తి



కుటుంబ సభ్యులతో సిరికొండ సోన

**భైంసా:** ఒకేసారి మూడు ప్రభుత్వ కొలువులు సాధించి సిరికొండ సోన అందరి మన్ననలు పొందుతోంది. భైంసా మండలం వానల్‌పాడ్‌కు చెందిన గృహిణి పిల్లలను చదివిస్తూ.. తాను చదువుకుంటూ ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమై పోటీ పరీక్షలు రాసి కొలువులు దక్కించుకుంది. ఇటీవలే విడుదలైన ఫలితాల్లో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలను సాధించింది.

**చదువంతా నిర్మల్‌లోనే...**

సిరికొండ సోన ఒకటి నుంచి పదో తరగతి వరకు నిర్మల్‌లోని సరస్వతీ శిశుమందిరంలో చదివింది. ఇంటర్ నిర్మల్‌లోనే పూర్తి చేసింది. 2010లో వానల్‌పాడ్ గ్రామానికి చెందిన సిరికొండ గాంధీతో వివాహమైంది. ఆ తర్వాత గాంధీ తన భార్య సోనను నిర్మల్‌లో డిగ్రీ, పీజీ చదివించాడు. ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ వచ్చినప్పుడల్లా ప్రోత్సహించాడు.

**పిల్లలను చదివిస్తూ... తాను చదువుతూ...**

సోన, గాంధీ దంపతులకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. రిశాంక్ ఆరవ తరగతి, రోహిత్ మోను మూడో తరగతి చదువుతున్నారు. వారిద్దరిని చదివిస్తూ తానూ పోటీ పరీక్షకు సిద్ధమైంది. ఇటీవల గురుకులాల్లో ఉద్యోగాల ఫలితాలు వెలువడగా టీజీటీ, పీజీటీల్లో ఎంపికైంది. జూనియర్ లెక్చరర్‌గానూ ఎంపికైంది.

### భర్త ప్రోత్సాహం..

మా వివాహం అయ్యాక నా భర్త డిగ్రీ, పీజీ చదివించేందుకు ప్రోత్సహించాడు. ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపిక కావడం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. జూనియర్ లెక్చరర్‌గా పనిచేయాలని అనుకుంటున్నాను. నా భర్తతోపాటు కుటుంబీకులకు ఎప్పటికీ రుణపడి ఉంటా. చదువు విషయంలో ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రోత్సహించడంతోనే కొలువులు సాధించాను. – సిరికొండ సోన, వానల్‌పాడ్

## ఐదేళ్లలో ఆరు ఉద్యోగాలు

**బజార్‌హత్నూర్:** మండల కేంద్రానికి చెందిన బిట్లింగ్ ఉదయ్‌కుమార్ 2019 నుంచి ఇటీవల ప్రకటించిన గ్రూప్–4 ఉద్యోగాల ఫలితాల వరకు ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలిచాడు. బిట్లింగ్ లక్ష్మణ్, లక్ష్మి దంపతుల కుమారుడు ఉదయ్‌కుమార్ 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగంలో చేరాడు. ఆ తర్వాత మూడేళ్లు 2019 నుంచి 2022 వరకు వీఆర్‌వోగా విధులు నిర్వర్తించాడు. 2022–23 పంచాయతీరాజ్‌లోనే జూనియర్ అసిస్టెంట్‌గా, 2023 డిసెంబర్ నుంచి నేటి వరకు సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో ఉన్నాడు. ఇటీవల ప్రకటించిన గ్రూప్–4 ఫలితాల్లో జిల్లాలో 11 స్థానంలో ఉన్నాడు. ఉదయ్‌కుమార్ బీటెక్ పూర్తి చేసి న్యూఢిల్లీలో సివిల్స్ కోచింగ్ తీసుకుని వరుసగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్నాడు.



బిట్లింగ్ ఉదయ్‌కుమార్

## ప్రత్యేకాధికారి.. మూడు ఉద్యోగాలు

**దండేపల్లి:** దండేపల్లి మండల కేంద్రానికి చెందిన మాడిశెట్టి రాజన్న–లక్ష్మి దంపతుల కూ తురు వినీత ప్రస్తుతం కన్నెపల్లి కస్తూర్బా పాఠశాల ప్రత్యేకాధికారి పని చేస్తున్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ టైలరింగ్ చేస్తూ పిల్లలను చదివించారు. వినీత ప్రభుత్వ కొలువు సాదించాలనే పట్టుదలతో చదివి, గురుకుల సొసైటీ అధ్యాపక ఉద్యోగ పరీక్షలు రాసింది. గురువారం విడుదలైన ఫలితాల్లో టీజీటీ, పీజీటీ, జేఎల్ మూడు ఉద్యోగాలు సాధించింది. ఒకటి నుంచి పదో తరగతి వరకు స్థానిక ప్రైవేటు పాఠశాలలో, ఇంటర్, డిగ్రీ లక్సెట్టిపేట ప్రైవేటు కాలేజీలో చదివింది. కాగా, జేఎల్ ఉద్యోగంలో చేరుతానని ఆమె తెలిపింది.



మాడిశెట్టి వినీత

## ముచ్చటగా మూడు..

**తాండూర్:** తాండూర్ మండల కేంద్రానికి చెందిన తన్నీరు హరిప్రసాద్ ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించాడు. ఆర్టీసీ ఉద్యోగి తన్నీరు బుచ్చయ్య, లావణ్య దంపతుల కుమారుడు హరిప్రసాద్ ఎంఏ ఆర్కియాలజీలో పీజీ పూర్తి చేశాడు. మూడు నెలల క్రితం రైల్వే గ్రూప్ డీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉద్యోగం కైవసం చేసుకున్నాడు. ఇటీవల విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ పరీక్షల్లో ఆర్టీఏ కానిస్టేబుల్‌గా ఎంపిక అయ్యాడు. 20 రోజుల క్రితం విడుదలైన గ్రూప్–4 పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 467, జిల్లా స్థాయిలో 17వ ర్యాంక్ సాధించి ముచ్చటగా మూడో ఉద్యోగానికి ఎంపికయ్యాడు.



హరిప్రసాద్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లి

### ఐపీఎస్ సాధించడమే లక్ష్యం



మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సంతృప్తినిచ్చింది. కానీ సివిల్స్ ర్యాంక్ సాధించి ఐపీఎస్ కావడమే ముందున్న ఏకైక లక్ష్యం. మూడేళ్లుగా చదువుతోపాటు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతూ విజయం సాధించా. ప్రస్తుతం సివిల్స్ ప్రిపరేషన్‌లో ఉన్నా. సివిల్స్‌లో కూడా విజయం సాధిస్తానని నమ్మకం ఉంది. – హరిప్రసాద్

## జూనియర్, డిగ్రీ లెక్చరర్

• గురుకుల ఫలితాల్లో బెల్లపు నగేశ్ సత్తా

**తాంసి:** ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే ఉన్నత ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో తాంసి గ్రామానికి చెందిన బెల్లపు నగేశ్ ఇటీవల విడుదలైన గురుకుల ఫలితాల్లో సత్తా చాటాడు. డిగ్రీ, జూనియర్ కళాశాల అధ్యాపకుడిగా ఉద్యోగాలు సాధించాడు. మండల కేంద్రానికి చెందిన బెల్లపు దేవిదాస్, తానుబాయి దంపతులది వ్యవసాయ కూలీ కుటుంబం. కుమారుడిని ప్రయోజకుడిని చేయాలనే లక్ష్యంతో కూలీ పనులు చేస్తూ నగేష్‌ను చదివించారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో, డిగ్రీ ఆదిలాబాద్‌లోని కళాశాలలో పూర్తి చేశాడు. 2015లో ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీలో పీజీ ప్రవేశ పరీక్షలో 2వ ర్యాంక్ సాధించాడు. పీజీ, 2019లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో బీఎడ్ పూర్తి చేశాడు. 2021లో మధ్యప్రదేశ్‌లోని రేవ సైనిక్ స్కూల్‌లో పరీక్ష రాసి అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గురుకుల డిగ్రీ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంక్, జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంక్‌తో ఉద్యోగాలు సాధించాడు. డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా చేరుతానని నగేశ్ తెలిపాడు.



నగేశ్

## నిత్యం నిర్మల్ లైబ్రరీకి వెళ్లి..

**కుంటాల:** మండలంలోని మెదన్‌పూర్ గ్రామానికి చెందిన కార్యం సుప్రియ ఇటీవల వెలువడిన గురుకుల ఫలితాల్లో రెండు ఉద్యోగాలకు ఎంపికైంది. ఒకటి నుంచి డిగ్రీ వరకు నిజామాబాద్‌లో చదువుకుంది. తండ్రి ఉపాధ్యాయుడు కాగా భర్త రాజు ప్రోత్సాహంతో దూరవిద్యలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఇంగ్లిష్ సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇంటి వద్ద ఉండి పూర్తి చేసింది. ఉపాధ్యాయ వృత్తిపై మమకారంతో పార్ట్ టైం ఉద్యోగినిగా పనిచేసింది. కుంటాల నుంచి ప్రతీరోజు నిర్మల్ లైబ్రరీకి వెళ్లి పరీక్షలకు సన్నద్ధమైంది. గురుకుల నియామక బోర్డు వెలువరించిన ఫలితాల్లో మొదటి ప్రయత్నంలోనే జూనియర్ లెక్చరర్, పీజీటీ ఇంగ్లిష్ ఉద్యోగాలకు ఎంపికైంది. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చు అని సుప్రియ పేర్కొన్నారు.



కార్యం సుప్రియ

## ఒకేసారి రెండు..

**సిర్పూర్(టి):** మండల కేంద్రంలోని పేట్ మహెలా కాలనీకి చెందిన అవేజ్ ఉర్ రహెమాన్ ఒకేసారి రెండు ఉద్యోగాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకుతో అద్భుతమైన ఫలితాలు సాధించాడు. గతంలో తెలంగాణ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన జూనియర్ లెక్చరర్ ఉద్యోగాల్లో పరీక్షలు రాసి జూనియర్ లెక్చరర్ ఉర్దూ మీడియంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఫిబ్రవరి 29న జూనియర్ లెక్చరర్ ఉర్దూ ఫలితాలు విడుదలయ్యాయి. శుక్రవారం విడుదల చేసిన టీజీటీ ఉర్దూ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకుతో ఉద్యోగం సాధించాడు.



అవేజ్ ఉర్ రహెమాన్

## క్రమశిక్షణ అలవర్చుకోవాలి

**ఉట్నూర్‌రూరల్:** చిన్నతనం నుంచే విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవడానికి దేశభక్తి, సామాజికసేవ దృక్పథం పెంపొందించుకోవడానికి స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణ శిబిరాలు దోహదం చేస్తాయని జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి అన్నారు. ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్యాట్రోల్ లీడర్ శిక్షణశిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. శిబిరంలో విద్యార్థులు నేర్చుకున్న అంశాలను వివరించారు. వారు తయారుచేసిన గ్యాడ్జెట్స్‌ను పరిశీలించారు. స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ డాక్టర్ ప్రమోదిని, ఎల్‌టీసీ రామ్‌రెడ్డి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ఎన్.స్వామి, జాయింట్ సెక్రెటరీ లక్ష్మి, ట్రైబల్ స్కౌట్స్ ఇన్‌చార్జి యాదవరావు, స్కౌట్ మాస్టర్లు కాశీరాం, లాల్యా, గైడ్ కెప్టెన్లు సిద్దేశ్వరి, సరిత, ఇందిర ఉన్నారు.

### ఏఎస్సై బాలాజీ మృతి

**భైంసాటౌన్:** పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కదం బాలాజీ శుక్రవారం మృతి చెందారు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఈ మేరకు చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, పట్టణ సీఐ రాజారెడ్డి, ఎస్సైలు, సిబ్బంది ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**కుంటాల:** మండలంలోని ఓలా పంచాయతీ పరిధిలోని రాజాపూర్ తండాకు చెందిన చౌహాన్ ఓంకార్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రజనీకాంత్ కథనం ప్రకారం.. చౌహాన్ ఓంకార్ గత కొన్నిరోజులుగా అనా రోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం సాయంత్రం గ్రామ పొలిమేరలో పురుగుల మందు తాగి కిందపడగా గ్రామానికి చెందిన సంగీతాబాయి చూ సి కుటుంబీకులకు సమాచారం అందించింది. వారు వెంటనే 108 వాహనంలో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నా రు.

### హెయిర్ కలర్ తాగి మహిళ..

**ఆదిలాబాద్‌రూరల్:** మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూహౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన సుంకమ్మ (33) హెయిర్‌కలర్ తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మృతురాలు సుంకమ్మ వెంట్రుకల చిక్కులు కొనుగోలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంది. గత కొన్నినెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె గురువారం ఇంట్లో హెయిర్ కలర్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించగా చికిత్సపొందుతూ రాత్రి మృతిచెందింది. భర్త కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

### విద్యుత్‌షాక్‌తో గేదెలు మృతి

**నేరడిగొండ:** మండలంలోని కుమారి గ్రామంలో శుక్రవారం విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతిచెందాయి. ఇనకరి విఠల్, ఎల్టి గంగారెడ్డికి చెందిన రెండు గేదెలు నీళ్లు తాగేందుకు గ్రామంలోని వాగు వద్దకు వెళ్లాయి. 5జీ మోటారు నీటిలో ఉండగా నీరు తాగుతుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాతపడ్డాయి. వీటి విలువ రూ.లక్ష వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కో రారు.

**అందకూర్‌లో..**

**కుంటాల:** మండలంలోని అందకూర్ గ్రామంలో విద్యుదాఘాతంతో గేదె మృతిచెందింది. పశువుల కాపరి రోజు మాదిరిగా శుక్రవారం గేదెను గ్రామంలో మేత కోసం తీసుకెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న ఎర్తింగ్ వైర్‌కు తగలి అక్కడికక్కడే చనిపోయింది. దీని విలువ రూ.1.10 లక్షలు ఉంటుందని బాధిత రైతు జితేందర్‌రావు తెలిపాడు. పశువైద్యాధికారి ప్రకాశ్ పంచనామా నిర్వహించారు. లైన్‌మెన్ అవదూత్ ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

## అన్ని రంగాల్లో రాణిస్తున్న 'ట్రిపుల్' విద్యార్థులు

• వీసీ వెంకటరమణ

**భైంసా:** బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఇందుకు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం క్యాంపస్‌లో విలేకరులతో మాట్లాడారు. బాసర ట్రిపుల్‌ఐటీకి రూ.103 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపించామని, ప్రభుత్వం రూ.33 కోట్లు ఇచ్చిందని తెలిపారు. వేతనాలతోపాటు ఇతర అవసరాలకు వీటిని వినియోగిస్తామన్నారు. ఇటీవలే సిగరెట్ కాలుస్తూ పట్టుబడ్డ విద్యార్థులను ఒక సెమిస్టర్ సస్పెండ్ చేశామని తెలిపారు. మెస్‌లో పనిచేసే వ్యక్తి సిగరెట్లు తీసుకువచ్చి విద్యార్థులకు ఇచ్చినట్లు తేలడంతో అతడిపైనా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. నార్కోటిక్ స్టేట్‌బ్యూరో ఈ విషయంపై సుమోటోగా కేసు నమోదుచేసి విచారణ చేస్తోందన్నారు. మార్చి 31వ తేదీ వరకు బాసర ట్రిపుల్ ఐటీ ఆస్తుల విలువ చూపించాలని మేనేజ్‌మెంట్ బోర్డు ఆదేశించిందని వెల్లడించారు. క్యాంపస్ ఆఫ్ కార్పొరేట్‌లో భాగంగా 850 మంది విద్యార్థులకుగాను 350 మందికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ ఏడాది 55 నుంచి 60 కంపెనీలు క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రూ.5లక్షల నుంచి రూ.17 లక్షల ప్యాకేజీ చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. 2023 ఎడ్యుకేషన్ కేటగిరిలో ట్రిపుల్‌ఐటీకి హరితహారం, మెగాప్లాంటేషన్‌లో మొదటి బహుమతి వచ్చిందని తెలిపారు. బాసర ట్రిపుల్‌ఐటీకి అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీలో మెంబర్‌షిప్ దక్కిందని పేర్కొన్నారు. ఎస్ఎస్ఎస్ ముంబై ఆధ్వర్యంలో ఫిమెన్స్ అనే సంస్థ 24 మంది విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు అందించనున్నట్లు తెలిపారు. ఇక్కడ చదివే నిరుపేద విద్యార్థులపై పూర్తిస్థాయి దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు మానసిక ఒత్తిడిని తగ్గించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. క్రీడల్లోనూ విద్యార్థులను ప్రొత్సహిస్తున్నామని చెప్పారు. ట్రిపుల్‌ఐటీని అగ్రగామిగా నిలిపేందుకు ఇక్కడి ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది అంతా పనిచేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో బాసర ట్రిపుల్‌ఐటీ అన్ని రంగాల్లోనూ మేటిగా నిలుస్తుందని వివరించారు.



మాట్లాడుతున్న వీసీ వెంకటరమణ